సాక్షి సిద్దిపేట

బుధవారం । 23 । అక్టోబర్ । 2024



ఆయుధాలతో అదరహో..

సిద్దిపేట పోలీస్‌కమిషనరేట్‌లో నిర్వహించిన ఓపెన్ హౌస్ ఆకట్టుకుంది.

వివరాలు 8లో ▸



హైబ్రిడ్ రకాలు అందించాలి

హైబ్రిడ్ రకాలను పెంపొందించి రైతులకు అందించాలని 'ఉద్యాన' వీసీ సూచించారు.

వివరాలు 8లో ▸



బాబోయ్.. కుక్కలు

గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ప్రభుత్వ మహిళా కళాశాలకు ఐఎస్ఓ గుర్తింపు



ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను చూపుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను మంగళవారం ఐఎస్ఓ బృందం సందర్శించింది. కళాశాలలోని వివిధ విభాగాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం కళాశాల పురోగతిపై ప్రిన్సిపాల్, అధ్యాకులతో మాట్లాడి అర్హతలను నిర్ధారించుకుని ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్ కుమార్ మాట్లాడుతూ ప్రత్యక్ష తనిఖీ పద్ధతిలో ఐఎస్ఓ గుర్తింపు పొందిన ఏకైక కళాశాల తమదేనన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామ్, అధ్యాపకులు డా. స్రవంతి, డా. సువర్ణాదేవి, డా. స్వప్న, కిషోర్, హరిప్రసాద్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సీపీని కలిసిన సబ్‌కోర్టు అదనపు పీపీ



సీపీ అనురాధకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అదనపు పీపీ నర్సయ్య

సిద్దిపేటకమాన్: సిద్దిపేట సబ్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సయ్య సీపీ అనురాధను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ట్రయల్‌లో ఉన్న కేసులలో నేరస్తులకు శిక్షలు పడే విధంగా సాక్షులను మోటివేట్ చేయాలని సూచించారు. కోర్టు విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు.

కాంగ్రెస్ రైతుల పక్షపాతి

జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



పోసాన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రసులాబాద్, పోసాన్‌పల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అక్రమాలకు తావులేకుండా చూడాలని పీఏసీఎస్ అధికారులకు సూచించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లనాగుల శ్వేత పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఐరన్ మెట్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సిద్దిపేటజోన్: పట్టణంలోని 25 వార్డు శివాజీనగర్‌లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను మంగళవారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి దేవరాజ్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రోడ్డు అక్రమించి ఐరన్ మెట్లు ఏర్పాటు చేసిన వాటిని, మురికి కాలువ పైన స్లాబ్ నిర్మాణం చేసిన వాటిని కూల్చివేశారు. ఈ సందర్భంగా దేవరాజ్ మాట్లాడుతూ.. గతంలోనే మున్సిపల్ నోటీసులు జారీ చేసిందని, అయినప్పటికీ సరైన బదులు లేకపోవడంతో చర్యలు తీసుకున్నామన్నారు. పట్టణంలో మున్సిపల్ నిబంధనల మేరకు నిర్మాణలు చేపట్టాలని, తప్పనిసరిగా అనుమతి ఉండాలని, నిర్మాణం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వరుణుడితో సతమతం వానరాలతో ఆగమాగం



వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఒక వైపు వర్షం ఇబ్బందులు పెడుతుంటే.. మరో వైపు కోతులు ధాన్యాన్ని ఆగమాగం చేస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో వర్షానికి ధాన్యం, మక్కలు తడవడంతో రైతులు ఆరబెట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే మార్కెట్‌లో 6,500 బస్తాల ధాన్యం తూకం వేసేందుకు సిద్ధంగా ఉన్నా.. అధికారులు కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. వరుణుడు మళ్లీ కన్నెర్ర చేయకముందే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

– సిద్దిపేటజోన్/స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



సిద్దిపేట వ్యవసాయ మార్కెట్‌లో ఆరబెట్టిన మక్కలను తింటూ చిందరవందర చేస్తున్న వానరాలు

ఆస్పత్రుల ఇష్టారాజ్యం!

గల్లీల్లో.. ఇరుకు భవనాల్లో నిర్వహణ

- రోగుల ప్రాణాలతో చెలగాటం
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రైవేటు హాస్పిటల్స్
- రక్షణ చర్యలు శూన్యం
- పట్టించుకోని వైద్య శాఖ అధికారులు



సిద్దిపేట పట్టణం శివాజీనగర్ గల్లీలో ప్రైవేట్ ఆస్పత్రులు.. నిత్యం ట్రాఫిక్ జాం

సిద్దిపేట పట్టణం శివాజీనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. అందులో ఫైర్ సెఫ్టీ కోసం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. పైగా గల్లీలో ఏర్పాటు చేసిన ఈ ఆస్పత్రి భవనం నాలుగు అంతస్తుల్లో ఉంది. లిఫ్ట్‌లో స్ట్రెచర్‌పై రోగిని తీసుకెళ్లడం గగనమే. ఏదైనా ప్రమాదం జరిగితే అందులో రోగుల ప్రాణాలు గాలిలో కలిసినట్టే.. ఇది ఈ ఒక్క ఆస్పత్రి దుస్థితే కాదు.. జిల్లాలోని 90శాతం ఆస్పత్రులు ఇదే విధంగా కొనసాగుతుండటం గమనార్హం.

సాక్షి, సిద్దిపేట: జిల్లా కేంద్రంలో ప్రైవేట్ ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. గల్లీల్లో ఇరుకిరుకు భవనాల్లో యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే తక్షణం చర్యలు చేపట్టే అవకాశం లేకుండా ఉంది. అడిగేవారు లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. రోగుల నుంచి ఫీజుల రూపంలో వేలకు వేలు పిండుతున్నాయి. ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

నిబంధనలు గాలికి

జిల్లాలో సుమారు 256 పైగా ప్రైవేట్ ఆస్పత్రులున్నాయి. సకల హంగులు కలిగిన విశాలమైన భవనాల్లో ఆస్పత్రులను ఏర్పాటు చేయాలి. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చే గదులు, అత్యవసర పరిస్థితుల్లో రోగులను తీసుకురావడానికి, తరలించడానికి విశాలమైన రోడ్లు కలిగిన చోట ఉండాలి. అగ్నిప్రమాదాలు జరగకుండా అన్ని రక్షణ ఏర్పాట్ల చేయాలి. అనుకోకుండా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు రోగులను వెంటనే సురక్షితంగా బయటకు తీసుకువచ్చే ఏర్పాట్లు, అలాగే మంటలను ఆర్పేందుకు ఫైర్ ఇంజన్ సులువుగా లోపలికి వచ్చే మార్గం, ఆస్పత్రి చుట్టూరా ఖాళీ స్థలం ఉండాలి. కానీ ఇవేవీ లేకుండానే ప్రైవేట్ ఆస్పత్రులను నిర్వహిస్తున్నారు. రద్దీ ప్రాంతంలో, ప్రధాన రోడ్ల పక్కన, కాలనీల్లో 150 గజాల స్థలం దొరికితే చాలు.. అందులో నాలుగైదు అంతస్తుల భవనం నిర్మించి ఆస్పత్రులను కొనసాగిస్తున్నారు. అద్దెకు దొరికినా సరే లీజు అగ్రిమెంట్ కుదుర్చుకొని ఏర్పాటు చేస్తున్నారు.

కానరాని తనిఖీలు

ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న సేవలపై వారంలో రెండు నుంచి మూడు రోజులు తనిఖీలు చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అదేశించింది. అయినప్పటికీ జిల్లా వైద్యారోగ్య శాఖ తనిఖీలు ఎక్కడా కనిపించడం లేదు. సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక, చేర్యాలలో ఈ మధ్య తనిఖీలు చేసిన సంఘటనలు లేవు. దీంతో ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యహిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రైవేట్ ఆస్పత్రులపై జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

“ అన్ని అనుమతులు తప్పనిసరి

ప్రైవేట్ ఆస్పత్రులలో అన్ని సదుపాయాలుండాలి. మున్సిపల్, ఫైర్ డిపార్ట్‌మెంట్ కాలుష్యనియంత్రణ మండలి అనుమతులుండాలి. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తప్పవు. ఆస్పత్రి ఆవరణలో వాహనాల పార్కింగ్‌కు సదుపాయాలుండాలి. ఏ డాక్టర్ పై రిజిస్ట్రేషన్ అయి ఉంటే వారే సేవలు అందించాలి.

-డాక్టర్ ఆనంద్, ప్రోగాం ఆఫీసర్

గుర్తుతెలియని పసిగుడ్డు

- ఆస్పత్రిలో వదిలివెళ్లిన వ్యక్తులు
- సిబ్బంది గుర్తించి అందిస్తున్న చికిత్స
- జిల్లా కేంద్రంలో ఘటన



శిశువును పరిశీలిస్తున్న డాక్టర్ శాంతి, సిబ్బంది

సిద్దిపేటకమాన్: నవ మాసాలు మోసి పేగు తెంచుకుని జన్మనిచ్చిన పసిగుడ్డు (ఒక రోజు వయసు)ను ఆస్పత్రిలో వదిలివెళ్లిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా కొనసాగుతున్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సోమవారం అర్ధరాత్రి తరువాత గుర్తు తెలియని వ్యక్తులు మగ శిశువును వదిలి వెళ్లారు. సమాచారం అందుకున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి శిశువును నవజాత శిశు సంరక్షణ కేంద్రం (ఎస్ఎన్‌సీయు)లో ఉంచి చికిత్స అందించారు. ఆస్పత్రిలో వదిలివెళ్లే సమయంలో శిశువు చేతికి క్యాన్‌లాగ్ పెట్టి ఉన్నట్లు గుర్తించారు. ఏదైనా ప్రైవేటు ఆస్పత్రిలో, లేదా క్లినిక్‌లో డెలివరీ జరిగి ఉండవచ్చని వైద్య సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి మాట్లాడుతూ.. 900 గ్రాముల బరువు ఉన్న మగ శిశువును ఆస్పత్రిలో వదిలి వెళ్లారని, గుర్తించి వెంటనే వైద్య చికిత్స అందించడం వల్లనే బాబు బతికాడని తెలిపారు. బాబు ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు తెలిపారు.

రోడ్ల నిర్మాణానికి రూ.11.49 కోట్లు



మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: నియోజకవర్గంలోని పలు రోడ్ల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరయ్యాయి. వివిధ రోడ్లు, వంతెనల నిర్మాణం కోసం పంచాయతీ రాజ్ సీఆర్ఆర్ గ్రాంట్స్ నుంచి రూ.11.49 కోట్లు నిధులు విడుదల చేస్తూ పంచాయతీ రాజ్ శాఖ సెక్రటరీ లోకేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కోహెడ మండల కేంద్రం నుంచి తంగలపల్లి వరకు 1.10 కి.మీ. బీటీ రోడ్డు కోసం రూ.1.55 కోట్లు, తంగలపల్లి నుంచి శ్రీరాములపల్లి వరకు 1.60 కి.మీ బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.1.50 కోట్లు, హుస్నాబాద్ మండలం పందిల్ల స్టేజీ నుంచి పొట్లపల్లి వరకు సింగిల్ లైన్ నుంచి 5.50 కి.మీ డబుల్ రోడ్ విస్తరణ కోసం రూ.3.95 కోట్లు మంజూరయ్యాయి. అలాగే అక్కన్నపేట మండలం సంజీవయ్య కాలనీలో 1.25 కి.మీ రోడ్డు నిర్మాణం కోసం రూ.1.40 కోట్లు, అక్కన్నపేట నుంచి సీడీ వర్క్స్ కోసం చౌటపల్లి మీదుగా మల్లంపల్లి వరకు రూ.కోటి, అక్కన్నపేట జెడ్పీ రోడ్ నుంచి పరికిబండ వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.60 లక్షలు, తోటపల్లి నుంచి పుసవర్లపల్లి మధ్య వంతెన నిర్మాణం కోసం రూ.1.49 కోట్లు నిధులు విడుదల చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిధుల విడుదల కోసం సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.

నిర్వాసితులపై రేవంత్‌రెడ్డిది కపట ప్రేమే

- నాడు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



నాడు తనతోపాటు నిరాహార దీక్షల్లో పాల్గొన్న రేవంత్‌రెడ్డి ఫొటోలను చూపుతున్న వంటేరు

గజ్వేల్: మల్లన్నసాగర్ నిర్వాసితులకు గతంలో ఎన్నో హామీలనిచ్చి.. నేడు సీఎం రేవంత్‌రెడ్డి కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిర్వాసితులకు మద్దతుగా అప్పటి దీక్షలో తనతో పాటు పాల్గొన్న రేవంత్‌రెడ్డి ఫొటోలను ప్రదర్శించారు. ఎకరాకు రూ.6నుంచి రూ.12లక్షలకు పరిహారం పెంచాలని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ప్యాకేజీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. నేడు అధికారంలోకి వచ్చి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక్క పైసా నిర్వాసితుల కోసం విదల్చలేదని మండిపడ్డారు. కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నిర్వాసితులను గుండెల్లో పెట్టి చూసుకున్నారని చెప్పారు. నిర్వాసితులకు సంబంధించి 90శాతం సమస్యలు పరిష్కారమైనా సాంకేతిక కారణాలతో ఇంకా పది శాతం అపరిష్కృతంగా ఉన్నాయని, ఆ పది శాతం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బెండె మధు, నవాజ్‌మీరా, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉపాధ్యాయ, ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యలపై నిర్వహించనున్న ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష వాల్ పోస్టర్‌ను మంగళవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. శ్రీనాకర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా పెండింగ్ బిల్లులు ఇప్పటి వరకు రాలేదన్నారు.

నాచగిరి వద్ద కార్డెన్ సెర్చ్



నాచగిరి వద్ద గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

వర్గల్(గజ్వేల్): నాచగిరి క్షేత్రం వద్ద మంగళవారం రాత్రి పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు పోలీసు సిబ్బందితో కలిసి బృందాలుగా విడిపోయారు. కమ్యూనిటీ కనెక్ట్‌లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. కిరాణా దుకాణాలు, లాడ్జీలలో, వైన్స్‌లో సోదా జరిపారు. ఎలాంటి ధృవపత్రాలు లేని 25 బైకులు, కారును సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ పురుషోత్తంరెడ్డి గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. నాచారం గుట్ట పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు ఉపేక్షించబోమని హెచ్చరించారు. కిరాయకు గదులు ఇచ్చే ఓనర్లు ధృవపత్రాలు పరిశీలించిన తరువాతే ఇవ్వాలన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయండి



కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నిస్తున్న ఏబీవీపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

సిద్దిపేటరూరల్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వివేక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వివేక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా విద్యారంగ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖను పర్యవేక్షిస్తున్నప్పటికీ విద్యారంగానికి బడ్జెట్‌లో కనీస నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. మూడేళ్లుగా దాదాపు రూ.7,800 కోట్ల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ముట్టడిలో భాగంగా నాయకులు కలెక్టరేట్‌లోని వెళ్ళేందుకు ప్రయత్నించగా పోలీసులకు, నాయకులకు మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదిత్య, పవన్, నగర కార్యదర్శులు రాకేష్, పర్శారాం, విద్యార్థులు పాల్గొన్నారు.

బతికుండగానే చంపేశారు

మరొకరికి పట్టా చేశారు

- రెవెన్యూ మాయాజాలం
- ఐదేళ్లుగా బాధితరైతు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- చేసేదిలేక పురుగు మందు డబ్బాతో నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగు మందు డబ్బాతో పోచయ్య కుటుంబం నిరసన

వర్గల్(గజ్వేల్): భూమి పట్టా చేయాలంటే రెవెన్యూ అధికారులు సవాలక్ష కొర్రీలు పెడతారు. క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే పట్టా మార్పిడి చేస్తారు. ఇందుకు భిన్నంగా బతికుండగానే రైతును చంపేసి, అతని భూమిని మరొకరి పేరిట మార్పిడి చేశారు. అసలైన పట్టాదారు తాను బతికే ఉన్నానని, భూమి నా పేరిట సరిచేయండని ప్రాధేయపడినా.. ఐదేళ్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకునే నాథుడే లేడు. చేసేదిలేక మంగళవారం కుటుంబసభ్యులతో కలిసి పురుగుల మందు డబ్బా పట్టుకుని వర్గల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వర్గల్ మండలం వేలూరుకు చెందిన రైతు ఉప్పరి పోచయ్యకు 37 గుంటల పట్టాభూమి ఉంది. దీనికి రైతుబంధు కూడా వచ్చింది. 2019లో రైతుబంధు సొమ్ము అకౌంట్‌లో జమకాకపోవడంతో రైతు పోచయ్య అధికారులను ఆరా తీశాడు. దీంతో ఆ భూమి మరొకరిపేరిట పట్టామార్పిడి జరిగిందని తెలిసి ఖంగుతిన్నాడు. గ్రామంలోనే తనలాంటి పేరే ఉన్న ఉప్పరి పోచయ్య అనే మరోవ్యక్తి మృతిచెందగా, అతని డెత్‌సర్టిఫికెట్ చూపి రెవెన్యూ అధికారుల సహకారంతో తన భూమిని కాజేశారని, అతని కొడుకు రామస్వామి పేరిట ఫౌతీ పట్టామార్పిడి తతంగం జరిగినట్లు తెలిసి నివ్వెరపోయాడు. పట్టాదారు మృతిచెందినపుడు అతని వారసులకు ఫౌతీ చేసే సందర్భంలో గ్రామంలో క్షుణ్ణంగా విచారణ జరపకుండా, రైతు మృతి వాస్తవమేనా నిర్ధారించుకోకుండా రెవెన్యూ అధికారులు ఎవరిదో భూమిని పట్టామార్పిడి చేయడంతో రికార్డులు మారి అసలురైతు భూమి కోల్పోయాడు.

రెవెన్యూ మాయాజాలంలో మరో రైతుకు అప్పనంగా భూమి సమకూరగా ఇరువురి మధ్య చిచ్చురేపింది. రికార్డులు సరిచేయాలని కార్యాలయం చుట్టూ తిరిగి వేశారిపోయామని, కలెక్టర్ కార్యాలయానికి వెళ్లామని బాధితరైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోమార్గం తోచక పురుగుమందు డబ్బాతో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్దకు రైతు ఉప్పరి పోచయ్య కుటుంబ సభ్యులతో కలిసి చేరుకున్నాడు. అధికారుల తీరు నిరసిస్తూ, న్యాయం చేయాలంటూ నిరసన వ్యక్తం చేశాడు. తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగాడు. న్యాయం చేస్తామని, కలెక్టర్‌కు నివేదిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

కలెక్టర్‌కు నివేదించాం



వేలూరులో రైతు ఉప్పరి పోచయ్య పట్టా భూమి ఫౌతీమార్పిడి సంబంధించి నివేదికను కలెక్టర్‌కు పంపించాం. గ్రామంలో ఒకే పేరుతో ఇద్దరు రైతులు ఉండడం, అందులో ఒకరు చనిపోవడంతో ఫౌతీద్వారా రికార్డు మార్పిడి జరిగింది. వాస్తవాలు కలెక్టర్‌కు నివేదించాం. తగు చర్యల కోసం కోరాం. న్యాయం చేస్తామని బాధితరైతుకు నచ్చజెప్పాం.

– బాల్‌రాజు, వర్గల్ తహసీల్దార్

క్లుప్తంగా

దుష్ప్రచారాలపై అఘోరీ ఫిర్యాదు

సిద్దిపేటఅర్బన్: తనను అరెస్టు చేశారంటూ దుష్ప్రచారం చేస్తున్న చానెళ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంచిర్యాల జిల్లా కృష్ణపల్లికి చెందిన మహిళా అఘోరీ శివవిష్ణు బ్రహ్మ సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారు. అనంతరం అఘోరీ మాట్లాడుతూ.. తన గురువును కలిసేందుకు హైదరాబాద్ నుంచి బద్రీనాథ్ వెళ్తుండగా దుద్దెడ టోల్‌గేట్ సమీపంలోకి వచ్చేసరికి తనపై చానెళ్లలో దుష్ప్రచారం జరుగుతోందని తెలిసిందని, వెంటనే సమీపంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తాను నిజమైన అఘోరీ కాదని, ఫేమస్ అయ్యేందుకు అఘోరీలా వేషం వేసుకొని ప్రజలను మోసం చేస్తోందని పలు యూట్యూబ్ చానెళ్లు, న్యూస్ చానెళ్లు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. వాటిని అరికట్టి తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్‌ను వివరణ కోరగా ఫిర్యాదు చేసిన విషయం వాస్తవమేనని, ఫిర్యాదు ఆధారంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇంటి పెరటిలో గంజాయి మొక్కలు సాగు



గంజాయి మొక్కలు పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

అల్లాదుర్గం(మెదక్): ఇంటి పెరటిలో గంజాయి మొక్కలు సాగు చేస్తుండగా ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. ఈ ఘటన అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. మెదక్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వర్ కథనం మేరకు..ముస్లాపూర్ గ్రామానికి చెందిన క్యాసారం అంజయ్య ఇంటి పెరటిలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు దాడి చేసి మూడు మొక్కలు స్వాధీనం చేసుకున్నాం. నిందితుడు అంజయ్యపై కేసు నమోదు చేసి అల్లాదుర్గం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ మాన్‌సింగ్, సిబ్బంది సిద్దయ్య, సర్దార్ అలీ, రవి, వెంకటేశ్, నరేశ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని రక్షించిన పోలీసులు

కుటుంబ సమస్యలతో ఆత్మహత్యాయత్నం



బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఎస్ఐ

నంగునూరు(సిద్దిపేట): కుటుంబ సమస్యలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న యువకుడిని పోలీసులు రక్షించారు. రాజగోపాల్‌పేట ఎస్ఐ అసీఫ్ కథనం మేరకు.. సిద్దన్నపేట గ్రామానికి చెందిన సాయి పురుగుల మందు తాగాడని అదే గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి సమాచారం అందించాడు. సాంకేతిక సహాయంతో సాయి బద్దిపడగ శివారులో ఉన్నట్లు గుర్తించి అక్కడికి చేరుకొని సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. యువకుడి ఆత్మహత్యాయత్నానికి ప్రేమ వ్యవహారమే కారణం పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆయుధం అదరహో..

సిద్దిపేట పోలీసు కమిషనరేట్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం

- పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహణ
- ఏకే 47, కార్బన్, 9ఎంఎం పిస్టల్‌తోపాటు పలు ఆయుధాలపై అవగాహన
- పాల్గొన్న 1700 మంది విద్యార్థులు
- బాంబులను పసిగట్టే డాగ్స్, స్పీడ్ లేజర్ గన్‌పై వివరణలు



విద్యార్థులతో కలిసి ఆయుధాలను పరిశీలిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సిద్దిపేట పోలీసు కమిషనరేట్‌లో మంగళవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పోలీసులు ఉపయోగిస్తున్న ఆయుధాల పనితీరు, పోలీసు చట్టాలు, షీ టీమ్, భరోసా సెంటర్ సేవలు, సీసీ కెమెరాల ఉపయోగాలు, స్పీడ్ లేజర్ గన్ పనితీరు, ట్రాఫిక్ నిబంధనలతోపాటు పలు రకాల విషయాలపై విద్యార్థులకు పోలీసు అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. సిద్దిపేట పట్టణం, రూరల్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 1,700 మంది విద్యార్థులు ఓపెన్ హౌస్‌లో పాల్గొన్నారు.

పలు అంశాలపై అవగాహన

కమిషనరేట్‌లో నిర్వహించిన ఓపెన్ హౌస్‌లో పోలీసులు వినియోగిస్తున్న ఆయుధాలు ఏకే 47, ఎస్ఎల్ఆర్, కార్బన్, 9ఎంఎం పిస్టల్, బీడీ టీమ్, ఫింగర్ ప్రింట్, క్లూస్ టీం, షీ టీమ్, భరోసా, కమాండ్ కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాలు, రోడ్డు ప్రమాదాలు, స్పీడ్ లేజర్ గన్, ట్రాఫిక్ రూల్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన కిట్, డాగ్ స్క్వాడ్, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై సీపీ అనురాధ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ మధు, ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్, సీఐలు ఉపేందర్, విద్యాసాగర్, శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, కిరణ్, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ దుర్గ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పూర్ణచందర్, విష్ణుప్రసాద్, రాజేశ్, ఎస్ఐ నర్సింహారావు, పోలీసు సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ లేజర్ గన్

రాజీవ్ రహదారిపై నిర్ణీత వేగం కంటే ఎక్కువ వేగంతో వెళ్లే వాహనాలను స్పీడ్ లేజర్ గన్ ద్వారా సిబ్బంది గుర్తించి వాహనాలను ఈ చలాన్ ద్వారా జరిమానా విధిస్తారు. స్పీడ్ లేజర్ గన్ పనితీరును కానిస్టేబుల్ జగదీశ్వర్ సీపీ అనురాధకు వివరించారు. పాఠశాల విద్యార్థులకు సైతం స్పీడ్ లేజర్ గన్ పనితీరు గురించి అవగాహన కల్పించారు.



ఓపెన్ హౌస్‌లో ఆయుధాలను చూపుతున్న పోలీసు సిబ్బంది

ఇన్‌సాస్ 5.56 ఎంఎం

ఇండియన్ నేషనల్ ఆర్మ్ సిస్టమ్ సంస్థ ఈ ఆయుధాన్ని తయారు చేసింది. 7 కేజీల బరువు గల ఈ ఆయుధం 1999 కార్గిల్ యుద్ధంలో ఉపయోగించారు. 600 మీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాన్ని ఛేదించొచ్చు. 30 రౌండ్స్ మ్యాగజైన్ కెపాసిటీతో ఈ ఆయుధం ఆటోమెటిక్‌గా పని చేస్తుంది. ఈ ఆయుధాన్ని జవాన్‌లు వినియోగిస్తారు.

అప్‌డేటెడ్ ఇన్‌సాస్ వెపన్

ఎక్స్ కాలిబార్ అనే ఆయుధం ఇన్‌సాస్‌కు అప్‌డేటెడ్ వెర్షన్ ఆయుధం. 4.4 కేజీల బరువు గల ఈ ఆయుధం 700 మీటర్ల దూరంలో ఉన్న టార్గెట్‌ను ఛేదించొచ్చు. 30 రౌండ్స్ మ్యాగజైన్ కెపాసిటీ ఉంటుంది. ఆటోమెటిక్ ఆపరేటీవ్ వెపన్ ఇది.

గ్లాక్ 17 పిస్టల్

ఈ గ్లాక్ 17 పిస్టల్ ఆస్ట్రియా వెపన్. ఫైబర్ బాడీతో ఈ ఆయుధం తయారు చేయబడింది. 17 రౌండ్స్ మాగ్యజైన్ కెపాసిటితో 100 యార్డ్స్ దూరంలోని టార్గెట్‌ను ఛేదించొచ్చు. కిల్లింగ్ రేంజ్ 50 యార్డ్స్ అని సిబ్బంది తెలుపుతున్నారు.

ఏకే 47 ఆయుధం

ఏకే 47 ఆయుధం మేడిన్ రష్యా వెపన్. లైట్ వెయిట్ మెషీన్ ఈ ఆయుధం బరువు 4 కేజీల బరువు ఉంటుంది. 30 రౌండ్స్ మ్యాగజైన్ కెపాసిటీ ఉంటుంది. ఆటోమెటిక్ వెపన్ ఇది. 1000 మీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాన్ని ఈ ఆయుధంతో ఛేదించొచ్చు. యూనిట్ కమాండర్ ఈ ఆయుధాన్ని వినియోగిస్తారు.

ఆయుధాల వివరాలు..

ఎంపీ 5 వెపన్

ఎంపీ 5 అనే వెపన్ ఆటోమెటిక్ మెషీన్. 30 రౌండ్ల మ్యాగజైన్ కెపాసిటీ గల ఆయుధం 100 యార్డ్స్‌లో ఉన్న టార్గెట్‌ను ఛేదిస్తుంది.

7.62 ఎంఎం ఎల్ఎంజీ వెపన్



7.62 ఎంఎం ఆయుధంతో ఏఆర్ సిబ్బంది రాజశేఖర్

ఈ ఆయుధాన్ని లైట్ మెషీన్ గన్ అని కూడా అంటారు. మేడిన్ ఇండియా వెపన్ 1950లో తయారు చేయబడింది. ఈ ఆయుధం చాలా తక్కువ బరువుతో ఉండి 30 రౌండ్ల మ్యాగజైన్ కెపాసిటీ ఉంటుంది. 1,000 మీటర్ల లక్ష్యాన్ని ఈ వెపన్ ద్వారా ఛేదించొచ్చు. ఈ వెపన్ ద్వారా ఒక నిమిషానికి 900 రౌండ్ల బుల్లెట్లు ఫైర్ చేయొచ్చు.



ఓపెన్ హౌస్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

ఘాతక్

ఏకే 47 ఆయుధానికి అప్‌డేటెడ్ వెర్షన్ ఆయుధం ఈ ఘాతక్ వెపన్. 4 నుంచి 5 కేజీల బరువు గల ఈ ఆయుధం 30 రౌండ్ల మ్యాగజైన్ కెపాసిటీ ఉంటుంది. ఈ వెపన్ ద్వారా 1000 మీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాన్ని ఛేదిస్తారు.



ఘాతక్ వెపన్‌ను చూపుతున్న కానిస్టేబుల్ యాదగిరి

విద్యుదాఘాతంతో లైన్‌మెన్ మృతి



నవీన్‌కుమార్(ఫైల్)

ఝరాసంగం(జహీరాబాద్): విద్యుదాఘాతంతో లైన్‌మెన్ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... జహీరాబాద్ మండల పరిధిలోని హుగ్గెల్లి గ్రామానికి చెందిన నవీన్‌కుమార్(35) ఝరాసంగం మండలంలో విద్యుత్‌శాఖలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మండల పరిధిలోని చిల్కపల్లి గ్రామ శివారులో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. మంగళవారం లైన్‌మెన్(ఆర్టిజన్) నవీన్‌కుమార్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేసి ఫ్యూజ్‌లు బిగిస్తున్న క్రమంలో ఒక్కసారిగా కరెంటు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేశ్ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



అశోక్(ఫైల్)

మర్కూక్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని అంగడి కిష్టాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ దామోదర్ కథనం మేరకు.. మండల కేంద్రమైన మర్కూక్ గ్రామానికి చెందిన అచ్చంగారి అశోక్ (34) సోమవారం గజ్వేల్ మండంలోని రాయవరం గ్రామానికి పని నిమిత్తం బైక్‌పై వెళ్లాడు. పనులు ముగించుకొని రాత్రి తిరిగి మర్కూక్ గ్రామానికి వస్తుండగా అంగడి కిష్టాపూర్ వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. వెంటనే గజ్వేల్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో కొంపల్లిలోని ఓ ప్రైవేట్ హస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

లారీ ఢీకొని వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రంగారెడ్డి జిల్లా శంకరపల్లి కి చెందిన క్రిష్ణ (34) హైదరాబాద్ నుంచి శంకరపల్లికి బైక్‌పై సోమవారం రాత్రి వెళ్తున్నాడు. పటాన్‌చెరు సాకి చెరువు దాటాక జాతీయ రహదారిపై సంగారెడ్డి వైపు వెళ్తున్న లారీ క్రిష్ణ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన అతడిని 108 సహాయంతో పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య పార్వతీ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..



కృష్ణ మృతదేహం

నిజాంపేట(మెదక్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కల్వకుంట గ్రామానికి చెందిన ముష్టి కృష్ణ (36) ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం కల్వకుంట గ్రామానికి చెందిన సబ్ స్టేషన్ సమీపంలో మృతి చెంది కనిపించాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

వాల్టాకు చట్టానికి తూట్లు

దర్జాగా చెట్లు నరికివేత



లోడ్ చేస్తున్న కర్రలు

అక్కన్నపేట(హుస్నాబాద్): వాల్టా చట్టాన్ని అతిక్రమించి దర్జాగా పెద్ద పెద్ద చెట్లను నరికేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అక్కన్నపేట మండలం కట్కూర్, దుబ్బతండా గ్రామాల పరిధిలోని రోడ్డుకు ఇరువైపులా పెద్ద వేప, ఇతర చెట్లను నరివేశారు. మంగళవారం కట్కూర్ నుంచి వంకాయతండాకు వెళ్లే మార్గంలో నరికిన చెట్లను వాహనాల్లో లోడ్ చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అటవీ, రెవెన్యూ శాఖ దృష్టి సారించి వాల్టా చట్టానికి తూట్లు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి నాలుగు రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో తొమ్మిది మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి రూ.14వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ప్రాణం తీసిన పంట రక్షణ తీగ

- విద్యుదాఘాతంతో మహిళతోపాటు రెండు మేకలు మృతి
- కౌడిపల్లి మండలంలో ఘటన



పొలంలో కాట్రోత్ బుజ్జి మృతదేహం



మృత్యువాత పడిన మేకలు

కౌడిపల్లి(నర్సాపూర్): అడవి పందుల బారి నుంచి వరి పంటను కాపాడుకునేందుకు వేసిన కరెంట్ కంచె మహిళతోపాటు రెండు మేకల ప్రాణం తీసింది. ఈ ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. జాజితండా పంచాయతీ రామాలయంతండాకు చెందిన కాట్రోత్ బుజ్జి (38) మంగళవారం ఉదయం మేకలను మేత కోసం అడవి వైపు తీసుకెళ్లింది. తండాకు చెందిన శోభ వరి పంటను అడవి పందుల బెడద నుంచి కాపాడుకునేందుకు చుట్టూ కరెంట్ వైర్‌తో కంచె ఏర్పాటు చేశారు. మేకలను మేపుతున్న బుజ్జి కరెంట్ కంచెను గమనించకుండా పొలం వద్దకు వెళ్లడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈమెతోపాటు రెండు మేకలు కూడా మృత్యువాత పడ్డాయి. గమనించిన తండావాసులు మృతురాలి భర్త సేవ్యానాయక్, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్ఐ రంజిత్‌రెడ్డి, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మహిళ మృతికి కారణమైన వాళ్లు వచ్చేదాక మృతదేహాన్ని తరలించేదిలేదని తండావాసులు ఆందోళన చేపట్టారు.నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకొని మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా చేస్తామని పోలీసులు నచ్చజెప్పారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే పంట యజమాని శోభతోపాటు కుటుంబ సభ్యులు తండాను విడిచి వెళ్లిపోయారు.

ఆస్తి వివాదం.. ఆగిన అంత్యక్రియలు

- మనస్తాపంతో ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య
- ఐదురోజులుగా ఆస్పత్రిలోనే మృతదేహంతో ఆందోళనలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఆస్తి వివాదంతో జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని యువకుడు ఆత్మహ్యకు పాల్పడ్డాడు. ఆస్తిలో వాటా ఇవ్వాల్సిందేనని మృతుడి భార్య, బంధువులు ఆందోళన చేపట్టడంతో ఐదు రోజుల తర్వాత అంత్యక్రియలు జరిగాయి. ఈ ఘటన సదాశివపేట మండల పరిధిలోని తంగడపల్లి గ్రామంలో మంగళవారం ఆలస్యంగా వెలు గులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన సిరిపురం మణయ్య, మణెమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు నవీన్, రాములు, కుమార్తె రజిత ఉన్నారు. గతేడాది చిన్న కుమారుడు నవీన్ మృతి చెందాడు. అతడి భార్యకు భూమి ఇవాల్సి వస్తుందని మణయ్య, మణెమ్మ దంపతులు తమ మూడెకరాల భూమిని అల్లుడు హోంగార్డ్ మల్లేశం పేరుపై సెల్ డీడ్ చేశారు. ఈ విషయం తెలిసి భూమిలో సగం వాటా తనకు ఇవ్వాలని పెద్దకుమారుడు రాములు(32) అడిగాడు. వారు ఒప్పుకోకపోవడంతో మనస్తాపానికి గురై 18న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అదే రోజు రాత్రి సదాశివపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్తిలో తమకు వాటా ఇవ్వాలని మృతుడి భార్య, బంధువులు ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో మృతదేహం ఐదురోజులుగా ఆస్పత్రిలోనే ఉంది. మంగళవారం సమస్య సద్దుమణగడంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారి ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ మహేష్ గౌడ్ తెలిపారు.

రైతులకు హైబ్రీడ్ రకాలను అందించాలి



వీసీ రాజిరెడ్డితో టీచర్స్ అసోసియేషన్ సభ్యులు

ఉద్యాన వర్సిటీ వైస్ చాన్స్‌లర్ రాజిరెడ్డి

ములుగు(గజ్వేల్): హైబ్రీడ్ రకాలను రూపొందించి రైతులకు అందించాలని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దండ రాజిరెడ్డి శాస్త్రవేత్తలకు సూచించారు. వీసీగా ఇటీవలె బాధ్యతలు స్వీకరించిన రాజిరెడ్డిని ములుగు విశ్వవిద్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో మంగళవారం తెలంగాణ హార్టికల్చర్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలతో వీసీ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పనిచేసి సమస్యల పరిష్కారం దిశగా శాస్త్రవేత్తల పరిశోధనలు కొనసాగాలని కోరారు. ఉద్యాన విద్యార్థులు ఉద్యాన పంటసాగు చేసే రైతుల క్షేత్రాల్లోకి వెళ్లి శాస్త్రీయంగా ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తెలుసుకోవాలని సూచించారు. అభ్యుదయ రైతుల అనుభవాల నుంచి విద్యార్థులు నేర్చుకోవాల్సిన అవసరముందన్నారు. తెలంగాణ హార్టికల్చర్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్.వీనానాయక్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి తమ వంతు కృషి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టూటా జనరల్ సెక్రటరీ సురేశ్ కుమార్, అసోసియేషన్ ప్రతినిధులు సైదయ్య, శ్రీనివాస్, సుచిత్ర, నిఖిల్, ప్రీతంగౌడ్, అశ్విన్ ఇతర శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థినులకు గాయాలు

మండల కేంద్రంలోని ఎంజేపీలో జెండాలు పాతుతుండగా ప్రమాదం



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్డీవో రమాదేవి

హవేళిఘణాపూర్(మెదక్): విద్యుదాఘాతంతో నలుగురు విద్యార్థినులకు గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే (ఎంజేపీ) బాలికల పాఠశాలలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఎంజేపీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి క్రీడలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో మంగళవారం ఉదయం విద్యార్థినులు రజిత, గాయత్రీ, వసంత, తనుష్క క్రీడా జెండాలను పాతుతున్నారు. పైన 11 కేవీ విద్యుత్ వైర్లను గమనించపోవడంతో ఇనుప రాడ్ తగిలి ఒక్కసారిగా కరెంట్ షాక్ కొట్టడంతో విద్యార్థినులు చెల్లా చెదురుగా పడిపోయారు. ఇది గమనించిన పాఠశాల సిబ్బంది విద్యార్థినులు హుటాహుటినా మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. విషయం తెలుసుకున్న మెదక్ ఆర్డీవో రమాదేవితోపాటు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి విద్యార్థినులను ఆస్పత్రిలో పరామర్శించారు. విద్యార్థినులతో పనులు చేయించడం ఎంతవరకు సమంజసమని ఆర్డీవో కళాశాల ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని..

ఉరేసుకొని యువతి ఆత్మహత్య



అర్చన (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉరేసుకొని యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అనంతసాగర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దాసరి కొండయ్య, మల్లమ్మకు ముగ్గురు కుమార్తెలు, కొడుకు ఉన్నారు. రెండో కూతురు అర్చన(18) గజ్వేల్ పట్టణంలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది. గ్రామానికి చెందిన యువకుడిని ప్రేమించానని ఇటీవల ఇంట్లో చెప్పడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో అర్చనకు పెళ్లి సంబంధం చూడగా సరేనని ఒప్పుకుంది. మంగళవారం ఉదయం తల్లిదండ్రులు పొలం పనికి వెళ్లాక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో కానిస్టేబుల్ భార్య

తూప్రాన్: ఆర్థిక ఇబ్బందులతో ఓ కానిస్టేబుల్ భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణ కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. మెదక్ ఎస్పీ కార్యాలయంలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ గుజ్జ భూమేశ్ యాదవ్ పెద్ద భార్య కవిత(38) పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా సమీపంలోని ఓ కాలనీలో నివాసం ఉంటుంది. కానిస్టేబుల్ రెండో భార్యతో మరో చోట ఉంటున్నాడు. కుటుంబ తగాదాలతోపాటు ఆర్థిక ఇబ్బందుల కారణంగా కవిత ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తుంది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పంట కోయడానికి వచ్చామని ఇంట్లో చోరీ

- వృద్ధురాలిని కట్టేసి బంగారం, నగదు అపహరణ
- వట్‌పల్లి మండలం పల్వట్ల గ్రామంలో ఘటన



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ అనిల్‌కుమార్

వట్‌పల్లి(అందోల్): సోయ పంటను కోసేందుకు వచ్చామని చెప్పి ఇంట్లోకి చొరబడి గుర్తు తెలియని దుండగులు బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన వట్‌పల్లి మండల పరిధిలోని పల్వట్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్వట్ల గ్రామానికి సంగారెడ్డి గారి సునందమ్మ అనే వృద్ధ మహిళ ఇంట్లో ఒక్కరే ఉంటున్నారు. కుమారుడు బీదర్‌లో నివాసం ఉంటూ వారంలో ఒకటి రెండు సార్లు ఇంటికొచ్చి వ్యవసాయ పనులు చూసుకొని వెళ్తాడు. ఈ విషయాన్ని పసిగట్టిన గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో వృద్ధురాలి ఇంటికొచ్చారు. సోయా పంట కోసేవారమని మీ కుమారుడు పంపించాడని, వర్షం పడేటట్లు ఉంది తలుపులు తీస్తే ఇంట్లో పడుకుంటామని నమ్మబలికారు. వృద్ధురాలు నిద్రలో నుంచి లేచి తలుపులు తీయగా దుండగులు ముఖాలు కనిపించకుండా హెల్మెట్లు ధరించుకొని ఇంట్లో చొరబడ్డారు. ఆమె తలపై కొట్టి కాళ్లు, చేతులు కట్టేశారు. ఇంట్లో రూ.20 వేలతోపాటు ఆమె మెడలోని 5 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. వృద్ధురాలు తెల్లారు జామున కట్టు విప్పుకొని ఇరుగుపొరుగు వారికి, పోలీసులకు చెప్పింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్‌టీంను రప్పించి వేలి ముద్రలను సేకరించారు. విషయం తెలుసుకున్న జోగిపేట సీఐ అనిల్‌కుమార్ చోరీ జరిగిన తీరును పరిశీలించారు. వృద్ధురాలి కుమారుడు వెంకట్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.